సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



ఇద్దరు దొంగల అరెస్టు
రాజంపేట, చిట్వేలి పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్యాంకుల వద్ద జరిగిన దొంగతనాల కేసులకు సంబంధించి ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. -8లో



ఆర్టీసీ బస్సు బోల్తా
కనిగిరి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ (ఆర్ఓబీ) వద్ద ఆదివారం వేకువ జామున ప్రమాదవశాత్తు బోల్తా పడింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.416

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 90 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు
రాయచోటి: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వారు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు
రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలకు, అంగన్ వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు నిర్వహణశాఖ హెచ్చరిక మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా సెలవు దినంగా ప్రకటించామని.. సంబంధిత యాజమాన్యాలు విధిగా పాటించాలని కలెక్టర్ అందులో ఆదేశించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సుమను అభినందిస్తున్న హెచ్ఎం సుజాత

చిట్వేలి: నాగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని వై సుమ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు సుజాత, ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 29, 30వ తేదీల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సుమ ఉత్తమ ప్రతిభను కనబరిచిందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం త్రోబాల్‌లో ప్రతిభ చాటిన సుమను అభినందించారు.

వైఈఎస్ కార్యవర్గం ఎన్నిక

కార్యవర్గ సభ్యులకు సత్కారం

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ (వైఈఎస్) జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పట్టణంలోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో ఆదివారం వైఈఎస్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ రమేష్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అన్నమయ్య జిల్లా యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడిగా గోరంట్ల నాగేంద్రబాబుయాదవ్, మహిళా గౌరవ అధ్యక్షురాలుగా పి.పద్మావతమ్మ, గౌరవ అధ్యక్షులుగా గుంజు కృష్ణయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాఘవేంద్రయాదవ్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా హరినాథ్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా యాదవ ఎంప్లాయ్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరసింహులు యాదవ్, గౌరవాధ్యక్షులుగా నంద్యాల రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష పత్రాన్ని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

రాయచోటి అర్బన్: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన పేదవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందించి ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబులరెడ్డి పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో అర్హత సాధించిన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు స్కాలర్‌షిప్ రూపంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎస్టియు, జనవిజ్ఞానవేదిక,పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జిల్లాలో జోరు వర్షం



- అన్నమయ్య జిల్లాపై తుపాను ప్రభావం
- రైల్వేకోడూరులో రెండు రోజుల్లో 123.8 మిల్లీ మీటర్ల వర్షం
- గుంజనేరుకు వరద ముప్పు
- భయాందోళనలో పరివాహక ప్రజలు
- వరి, పండ్లతోటలకు నష్టం


రైల్వేకోడూరులో రోడ్లపై వర్షపు నీరు


రైల్వేకోడూరు అర్బన్: మొదలైన గుంజన ప్రవాహం

రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 60 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. శేషాచల కొండలపై నుంచి కురిసిన వర్షం వల్ల సుండుపల్లి మండల పరిధిలో ఉన్న పింఛా ప్రాజెక్టులోకి వర్షపునీరు భారీగా చేరుతుంది. వర్షాలు వరి, టమోటా, బొప్పాయి ఇతర ఆకు కూరల తోటలకు కొంతమేర నష్టాన్ని చేకూర్చాయి. పొగమంచు రావడంతో వాహన దారుల ప్రయాణం కష్టతరంగా మారింది.

- గుంజన ఏటికి వరద ముప్పు పొంచి ఉంది. గుంజన పరివాహక ప్రాంతాలైన రెడ్డివారిపల్లి, నరసరాంపేట, కృష్ణానగర్, ధర్మాపురం, గాండ్లవీధి ప్రాంతాలు ప్రజలు ప్రాంతాలలో ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. గుంజనేరు పట్టణం చుట్టూ ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు పడితే గుంజన ఏరు ప్రవా హం మరింత ఉధృతం అయ్యే అవకాశం ఉంది. గంగురాజుపోడుకు వెళ్లేదారి ఇప్పటికే కొట్టుకు పో యింది. అధికారులు పరీవాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టారు.

వర్షానికి కూలిన ట్రాన్స్‌ఫార్మర్
పీలేరు రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కుప్పకూలింది. స్థానిక సదుం రోడ్డు మార్గంలోని బిస్మిల్లా నగర్‌లో పింఛా నది గట్టున ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోయింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏడీ అమీర్‌బాషా, ఏఈ ఖాదర్ ఇలాహీ సంఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు చర్యలు చేపట్టారు.


రాయచోటి: కోత దశలో ఉన్న వరి


పుల్లంపేట: పుల్లంగేరు ఉధృతి


మదనపల్లె: కొత్తవారిపల్లెలో నేలకొరిగిన వరి

వర్షపాతం వివరాలు..
రాయచోటి: తుపాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. కోడూరులో 123.8 మిల్లీ మీటర్లు, కలికిరి 81.2, ఓబులవారిపల్లి 80.0, పీలేరు 67.4, చిట్వేలి 60.2, కేవీ పల్లి 57.6, రాజంపేట 45.8, పుల్లంపేట 40.8, నిమ్మనపల్లి 33.6, వాల్మీకిపురం 32.6, కురబలకోట 32.2, గుర్రం కొండ 31.2, టి.సుండుపల్లి 31.0, నందలూరు 31, కలకడ 30.6, పెనగలూరు 30, పెద్దమండం 28.6, తంబళ్లపల్లి 21.4, మదనపల్లి 21, సంబేపల్లి 20.6, రాయచోటి 18.4, రామసముద్రం 17.6, బి కొత్తపేట 15.4, రామాపురం 14, చిన్నమండెం 13.6, ములకల చెరువు 12.6, గాలివీడు 12.4, పెద్దతిప్పసముద్రం 11.8, వీరబల్లి 11.2, లక్కిరెడ్డిపల్లి 8.8 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.


పీలేరు: కూలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

జలకళ

బోటుమీదపల్లి - పుల్లంపేట మార్గంలో వరద నీరు

పుల్లంపేట: పుల్లంగేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు, ప్రజలు ఈ ఏడాది సాగు, తాగునీటి కొరత నుంచి బయటపడవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుల్లంగేరు ప్రవహిస్తుందని తెలిసిన చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు చూసేందుకు పుల్లంగేటి బ్రిడ్జి వద్దకు చేరుకొని నీటిని చూసి ఆనందంతో పరవశించి పోయారు.

ఎయిడ్స్‌రహిత జిల్లాగా మారుద్దాం

డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్‌రహిత జిల్లాగా మారుద్దామని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి గురించి మాట్లాడుకున్నప్పుడే ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెరుగుతుందన్నారు. జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శైలజ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9 ఐసిటిసి కేంద్రాల ద్వారా ఎయిడ్స్‌పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టి కేంద్రాల ద్వారా జీవితకాలం మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ ప్రతిభను కనబరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందచేశారు. అంతకు ముందు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాయచోటి పురవీధులలో నిర్వహించిన ర్యాలీని డీఎంఅండ్‌హెచ్ఓ,అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ ప్రారంభించారు. ఏఎస్ఐ సర్దార్, హెల్త్‌ఎడ్యుకేటర్‌లు బలరామరాజు, మహమ్మద్‌రఫీ, పీసీఎస్ఎస్ అధ్యక్షుడుచెన్నారెడ్డి, డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శివభాస్కర్, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు కేవీఎస్ నాయుడు, సీహెచ్ఓ నారాయణ పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలకు విశేష స్పందన
రాజంపేట టౌన్: పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈనెల 11వ తేదీ గీతాజయంతిని పురస్కరించుకొని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 6,7 తరగతుల విభాగంలో రాజంపేట గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన శ్రావణి, అక్షరస్కూల్‌కు చెందిన సాయియోషిత, రాజు హైస్కూల్‌కు చెందిన సాహితీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. 8, 9, 10వ తరగతుల విభాగంలో ధర్మనిధి, శివపార్వతి, పి.అన్వితలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. సంపూర్ణ భగవద్గీత పోటీల్లో రాయచోటికి చెందిన అన్విత, మదనపల్లెకు చెందిన ధన్విక ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రయ్యనాయుడు వ్యవహరించారు.


భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల విజేతలు వీరే

జాతీయ జట్టు ఎంపికల్లో చోటు

అరుణ

కడప స్పోర్ట్స్: జాతీయ స్థాయి అండర్-20 మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపికల్లో వైఎస్ఆర్ జిల్లాకు చెందిన టి.అరుణ చోటు దక్కించుకుంది. ఈ పోటీలు ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ నెల 10న బెంగళూరులో తుది జట్టు ఎంపికలు నిర్వహిస్తారు. మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి సహకారం అందిస్తున్నటు ఎం.డానియల్ ప్రదీప్ తెలిపారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పల్లకి సేవ

పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి అమావాస్య పల్లకి సేవ నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కమనీయంగా అయ్యప్పస్వామి లక్షార్చన
- పాల్గొన్న 2 వేల మందికి పైగా దీక్షదారులు
- 35 వేల మంది భక్తులకు అన్నప్రసాదం


అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ (వైఎస్ఆర్ జిల్లా): పట్టణ శివారు ప్రాంతమైన పెన్నా నది తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం లక్షార్చన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, వెంకటేశ్వర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన సెట్టింగ్‌లో గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. సుమారు 2 వేల మంది అయ్యప్పస్వామి దీక్షదారులు పాల్గొన్నారు. పసుపు, కుంకుమ, పూలు, భస్మం, పూజా ద్రవ్యాలతో లక్షసార్లు స్వామివారిని మనసారా అర్చించి శరణు వేడారు. అయ్యప్పస్వామి మూల విరాట్‌కు భస్మాభిషేకం, గంధాభిషేకం, నెయ్యాభిషేకం, కుంకుమాభిషేకం, గో క్షీరాభిషేకం వంటి అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. దీక్షదారులు కలశాన్ని అయ్యప్ప నామ స్మరణల మధ్య ఊరేగించారు. కలశంలోని పూజా ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. అమృతేశ్వరస్వామికి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలకు ప్రత్యేక పూజలతోపాటు అలంకరణ చేశారు. దాదాపు 35 వేల మంది భక్తులకు స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు అన్నప్రసాదాన్ని అందించారు. 45 వేల మందిపైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌సీపీఈ, ఆర్‌టీడీ, దీక్షదారులు, వలంటీర్లు దాదాపు 500 మందికిపైగా సేవలందించారు. పుర ప్రముఖులతోపాటు అధికారులు, ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. స్వామి అయ్యప్ప సేవాసంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి శాలువ కప్పి సత్కరించారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్, స్వామి అయ్యప్ప సేవాసంఘం వైస్ ప్రెసిడెంట్ నారాయణ, కార్యదర్శి సతీష్, ట్రెజరర్ టంగుటూరి వినోద్‌కుమార్, పీఆర్ఓ ధారా సంంతోష్ అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


లక్షార్చన చేస్తున్న దీక్షధారులు

ఉద్యోగుల ఆశలు ఆవిరి

- డీఏ,పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిల కోసం ఎదురు చూపులు
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం



మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ఆనందం ఆవిరైపోయింది. ఆర్థిక ప్రయోజనాలు ఒక్కటీ నెరవేరడం లేదు. చంద్రబాబుకు ఓటేస్తే అన్ని బకాయిలు వస్తాయని ఆశ పడిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా చిల్లిగవ్వ విదిల్చలేదు. పీఆర్‌సీ, పీఎఫ్ లోన్లు, డీఏ, ఏపీజీఎల్ఐ బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇలా జిల్లాలో దాదాపు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కోట్ల రూపాయల్లో ఉన్నాయి. ఇవన్నీ కూటమి ప్రభుత్వం ఇచ్చేనా అని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

- కూతురి పెళ్లి కోసం పీఎఫ్ లోనుకు దరఖాస్తు చేసున్నాడో ఉద్యోగి..డబ్బుల కోసం ఎదురు చూశాడు. రాలేదు. చివరికి అప్పుచేసి పెళ్లి చేశాడు. ఇప్పటికైనా వచ్చిందా అంటే.. అతీగతి లేదు. ఇక ఇళ్లు కట్టుకుందామనో, అపార్టుమెంట్ కొనుక్కుందామనుకునే వారి సంగతి సరేసరి. ఎప్పుడు చేసినా సీఎఫ్ఎంఎస్‌లోనే ఫండ్స్ క్లియరెన్స్ అనే చూపుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పోనీ పీఆర్‌సి బకాయిలైనా వస్తాయా? అని ఎదురు చూస్తే ఎప్పుడో రిటైర్డు అయిన ప్పుడు ఉద్యోగ విరమణతో కలిపి ఇస్తారంట అని యూనియన్ నాయకులు చెబుతుండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.
- ఏపీజీఎల్ఐ 18 నెలల క్రితమే క్లియర్ అయినా ఇప్పటి వరకు రాలేదు. సరెండర్ లీవులు (ఆర్జిత సెలవులు) బకాయిలు కోసం ఉద్యోగులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు.
- చంద్రబాబు వస్తే బకాయిలన్నీ త్వరగా వస్తాయనే ఆశతో ఉన్న ఉద్యోగుల ఆశలు గల్లంతయ్యాయి. వచ్చే ఏడాది మార్చి వరకు ఎలాంటి బకాయిలు చెల్లించేది లేదని, ఇటీవల రహస్యంగా జీవోను కూడా విడుదల చేశారని ఉద్యోగులు వాపోతున్నారు.

బకాయిల కోసం ఎదురు చూపులు
జిల్లాలో సుమారు 7వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు.వీరితో పాటు 12 వేల మంది వరకు ఉద్యోగులు ఉన్నారు. ప్రధానంగా పీఆర్‌సీ బకాయిలు, పీఎఫ్ లోన్లు, డీఏ, ఏపీజీఎల్ఐ బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఉన్నాయి. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఒక్కటంటే ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. దసరాకు ఇస్తారనుకున్నారు. కనీసం దీపావళికి అనుకున్నారు. ఇక సంక్రాంతికి ఇస్తారా అంటే అది కూడా కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఐఆర్ తక్షణమే ప్రకటించాలి

ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి. పీఆర్‌సీ కమిషన్‌ను వేసి నివేదిక వచ్చేలోపు ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలి. గతంలో పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలు, పీఎఫ్ రుణాలు చెల్లించాలి. –పోకల మధుసూదన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

వర్షానికి కూలిన పెంకుటిల్లు


పడిపోయిన ఇంటిని చూపిస్తున్న బాధితుడు దాసరి సుబ్రమణ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని అయ్యలరాజుపల్లి దళితవాడ గ్రామంలో దివ్యాంగుడు దాసరి సుబ్రమణ్యంకు చెందిన పెంకుటిల్లు ఆదివారం కూలిపోయింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వర్షపునీరు ఇంటిలోకి రావడంతో మట్టి గోడలు వర్షానికి తడిచి పడిపోయాయి. దాసరి సుబ్రమణ్యం దివ్యాంగుడు కావడంతో జీవనోపాధి కూడా లేదు. ఇంట్లో తాను, తన అక్క ఉన్నారు. ఇల్లు కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం లేదా దాతలు ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

లబ్ధిదారులకు ఊరట


లబ్ధిదారులకు పట్టాలిచ్చిన భూమి

సంబేపల్లె : మండల పరిధిలోని నారారెడ్డిపల్లె గ్రామం ముదినేనివాండ్లపల్లె సమీపంలో సర్వే నంబర్ 398-2 లో గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు పట్టాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అది ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టారు. దీనిని సవాల్ చేస్తూ లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు యథావిధిగానే భూమి ఉండాలని ఆదేశాలు జారీ చేయడంతో లబ్ధిదారులకు ఊరట లభించింది. ఇప్పటికైనా అధికారులు ఆ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అవని మెచ్చిన గణితావధాని

- గణిత బ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ
- దేశ వ్యాప్తంగా 6వేలకుపైగా ప్రదర్శనలు
- నేడు వర్ధంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : అన్నీ తెలిసిన వారే లెక్కల్లో తప్పులు చేస్తూ తడబడుతుంటారు. అలాంటిది గణితంలో ఎంత పెద్ద లెక్కలైనా అలవోకగా ఇట్టే చెప్పగలరు. పుట్టు అంధుడైనా లెక్కల గణనలో ఆయనకు సాటి మరెవరూ లేరు. ఎలాంటి సమస్యనైనా క్షణాల్లోనే పరిష్కరించే గణిత నైపుణ్యం అయనది. తెలుగుభాషలో అవధానం అంటే అందరికి తెలిసి ఉంటుంది. కానీ గణితంలో అవధానం చేయడం చాలా కష్టతరమైనది. అలాంటిది గణితంలో అవధానం చేసి అందరిని ఆశ్చర్యచికితులను చేసిన గొప్పవ్యక్తి గణితబ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ. వేలాది మంది కూర్చున్న సభలో నిమిషానికి 20 నుంచి 30 కష్టమైన లెక్కలను అడిగిన వెంటనే వయోలిన్ వాయిస్తూ సమాధానం చెప్పే గొప్ప మేధస్సు ఆయనది. ఈ విద్య ఎలా నేర్చుకున్నావు అని ఎవరైనా అడిగితే దేవుడు ఇచ్చాడని చెప్పేవారు శర్మ.

లక్కోజు సంజీవరాయశర్మ నవంబర్ 22వ తేదీన 1907లో ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో జన్మించారు. ఈయన పుట్టుకతో అంధుడు. ఈయనను బతికించడం కన్నా దిబ్బలో పూడ్చివేయండని వాళ్ల అమ్మకు ఆయన మేనత్త సలహా ఇచ్చిందట. బంధువులు ఉగ్గుగిన్నెలో వడ్ల గింజలు వేసి పట్టించారట. అయినా ఆయన చనిపోలేదు. సంజీవరాయశర్మ హస్తరేఖలు చూసిన ఆయన తాత గొప్ప ప్రతిభావంతుడవుతాడు అని చెప్పడంతో ఆ ప్రయత్నాలను ఆపివేశారు.

విద్యాభ్యాసం..

అంధులకు ఉపయోగపడే బ్రెయిలీ లిపి ఆ రోజుల్లో లేకపోవడంతో సంజీవరాయశర్మ చదువుకోలేకపోయారు. శర్మ అక్క అక్కమ్మ కల్లూరు ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసేవారు. ఆమె పాఠశాలలో చెప్పిన పాఠాలు, అంకెలు, గణిత సూత్రాలు సంజీవరాయశర్మకు చెప్పడంతో శర్మ గుర్తుపెట్టుకుని పునశ్చరణ చేశారు. ఎవ్వరివద్ద చదువుకోకుండానే గణితంలో తనకంటూ తెలియని విషయాలు ఏవీలేవంటూ విమర్శకులను మెప్పించారు. గణితంలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్న సమయంలోనే కల్లూరులోని లక్ష్మీనరసయ్య దగ్గర ఆయన వయోలిన్ నేర్చుకున్నారు.

ఆరువేలకు పైగా గణితావధానాలు

1928లో సంజీవరాయశర్మ తొలి గణితావధాన ప్రదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ, తదితర రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి దాదాపు 6వేల దాకా ప్రదర్శనలు ఇచ్చి అందరి మన్ననలను పొందారు. అనేక విశ్వవిద్యాలయాలు ఆయనను సత్కరించాయి. 14 బంగారు పతకాలు ఆయనను వరించాయి.

హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవిచే ప్రశంసలు

1958 జనవరి 21న బెంగళూరు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో శర్మ గణిత అవధాన ప్రదర్శన ఇచ్చారు. ఈ సదస్సులో హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలా దేవి శర్మకు పరిచయం ఏర్పడింది. ఆయన మేధా సంపత్తిని, గణిత శాస్త్ర ప్రావీణ్యాన్ని, ప్రతిభను చూసి ఆమె ఆశ్చర్యచకితురాలయ్యారు. ''శర్మ నా కంటే గొప్పవారు, తేదీ ఇస్తే దానికి నేను వారం మాత్రమే చెప్పగలను.. శర్మ తెలుగు సంవత్సరం, నెల, నక్షత్రం, తిథి, రాశి తదితర వివరాలన్ని చెబుతారు ఇది సామాన్యమైన విషయం కాదు'' అని శకుంతల ఆయన గొప్పతనాన్ని కొనియాడటం విశేషం.

4వేల సంవత్సరాల క్యాలెండరు తయారీ

1953లో 4000 సంవత్సరాలకు సరిపోయే క్యాలెండరును తయారు చేసి ఆనాటి భారత రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు పంపారు. రాష్ట్రపతి ప్రశంసిస్తూ ''నెల చివరి రోజులు కనుక నా జీతంలో మిగిలిన మొత్తం రూ.875 పంపిస్తున్నానని, ఎక్కువ సొమ్ము పంపలేక పోయానని'' సందేశం పంపి సంజీవరాయశర్మ గొప్పతనాన్ని కొనియాడారు.

నెహ్రూ ఎదుట గణితావధానం

1959లో ఢిల్లీలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన గణితావధానంలో రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్, న్యాయమూర్తి పీవీ రాజమన్నార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సభలో నెహ్రూ 7 నిలువు వరుసలు, 7 అడ్డ వరుసలు ఉన్న చదరంగంలో 238 అంకెలు ఎటుకూడినా వచ్చేవిధంగా అంకెలు వేయమనగా శర్మ అంకెలు చెప్పి సభికులను ఆశ్చర్యానికి గురి చేశారు.

విజ్ఞానాన్ని దొంగిలించలేరు

1964లో రేణిగుంట నుంచి తిరుపతికి శర్మ రైలు ప్రయాణం చేస్తుండగా ఎవరో దొంగ ఆయన కోటుకు ఉన్న 14 బంగారు పతకాలను దొంగిలించారు. ''నా పతకాలు దొంగిలిస్తే దొంగిలించారు కానీ. నా విజ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరని'' ఆయన బాధపడకుండా చెప్పారు.

డాక్టరేట్ ప్రదానం

ఈయన ప్రతిభను గుర్తించిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1993లో డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించింది. అలాగే గణిత బ్రహ్మ, అంకవిద్యాసాగర, విశ్వసాంఖ్యాచార్య బిరుదులు ఉన్నాయి. 1968 నుంచి 1993 వరకు కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆయన ఫిడేలు వాయిస్తూ జీవనం సాగించారు. 1994లో జనవరి 5న భార్య ఆదిలక్షుమ్మ చనిపోవడంతో కుమారుడు సుబ్బారాయుడు వద్దకు చేరారు. డిసెంబర్ 2న హైదరాబాదులో ఈయన పరమపదించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విగ్రహం ఏర్పాటు..

కల్లూరులోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ప్రతి ఏడాది నవంబరు 22న లక్కోజు సంజీవరాయశర్మ జయంతి వేడుకలను నిర్వహించి గణిత ప్రతిభా పరీక్షలో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్నారు. పాఠశాలలో 1989-90లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి సంజీవరాయశర్మ ప్రాంగణం అని పేరు పెట్టారు. 2019లో డిసెంబర్-2న సంజీవరాయశర్మ వర్ధంతి సందర్భంగా శర్మ విగ్రహాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.



కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సంజీవరాయశర్మ విగ్రహం

ఇంగ్లండులో విగ్రహం పెట్టేవారు..

సంజీవరాయశర్మ తొలిసారిగా 1928లో నంద్యాలలో గణితావధానం చేశారు. 1928 నవంబర్ 15న నంద్యాలలో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. ఈ సభలో శర్మ నిర్వహించిన గణితావధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 1961 జనవరి 16న ముద్దనూరులో యామవరం రోశిరెడ్డి నాయకత్వంలో శర్మ గణితావధానం చేశారు. ఈ ప్రదర్శన తిలకించిన పండితులు, శాస్త్రవేత్తలు, ప్రజలు ఆనందభరితులై అప్పటికప్పుడు అందరు డబ్బు సేకరించి ఆయనకు బంగారు పతకం, కొంత నగదు అందజేసి సత్కరించారు. ఇదే ఆయనకు లభించిన మొదటి బంగారు పతకం. 1931 జులై 21న ఆంధ్ర మహాసభ భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు నాగేశ్వరరావు అధ్యక్షతన సంజీవరాయశర్మ గణితావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి మద్రాసు గవర్నర్ సర్‌జార్జి స్టాన్లే అవధానం తిలకించి ఆశ్చర్యచికితులై శర్మతో కరచాలనం చేశారు. శర్మ ఇంగ్లాడులో పుట్టి ఉంటే ఆయన విగ్రహాన్ని లండన్ నడిబొడ్డున ఏర్పాటు చేసి దేశాధ్యక్షుని చేత ఆవిష్కరించి గౌరవించేవాళ్లమని కొనియాడారు.


లక్కోజు సంజీవరాయశర్మ (ఫైల్)

గ్రామానికి గర్వకారణం



సంజీవరాయశర్మ మా గ్రామంలో జన్మించడం మాకు గర్వకారణం. గణిత బ్రహ్మగా పేరుగాంచిన ఆయన గ్రామానికి ఖ్యాతి తెచ్చిపెట్టారు. 6వేలకు పైగా గణిత అవధానాలు చేసిన ఆయన గొప్పతనాన్ని ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎంతో కష్టతరమైన గణిత సమస్యలు క్షణాల్లో చెప్పేవారని శర్మ గొప్పతనాన్ని పెద్దలు చెబుతారు. అలాంటి వ్యక్తి అందరికి స్ఫూర్తిదాయకం.

- కల్లూరు నాగేంద్రారెడ్డి, మాజీ సర్పంచ్, కల్లూరు

జయంతి వేడుకలను నిర్వహిస్తున్నాం



గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయశర్మ మహామేధావి. దేశనాయకులు, గణిత శాస్త్రజ్ఞులు, పండితులు శర్మ గణితావధానాన్ని ప్రశంసించారు. ఆ మహోన్నత వ్యక్తి మేధస్సు గురించి భావితరాలకు తెలియాలనే ఉద్దేశంతో ఆయన జయంతి నాడు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాం.

-కేవీ విజయమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు

ఆర్టీసీ బస్సు బోల్తా

10 మందికి గాయాలు


కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్ వద్ద బోల్తాపడిన కనిగిరి ఆర్టీసీ బస్సు


గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కురబలకోట : కనిగిరి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ (ఆర్ఓబీ) వద్ద ఆదివారం వేకువ జామున ప్రమాదవశాత్తు బోల్తా పడింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ప్రాణాపాయం తప్పింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, ఆర్టీసీ అధికారుల కథనం మేరకు..కనిగిరి నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా కురబలకోట రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్‌పై ఆదివారం వేకువ జామున రెండు గంటల ప్రాంతంలో వెనుక వచ్చిన కారు బస్సును ఓవర్ టేక్ చేసి ముందుకు వచ్చింది. ముందు వెళ్తున్న కారు ఉన్నట్టుండి కుడి పక్కకు తిరిగింది. దీంతో వెనుక వస్తున్న కనిగిరి ఆర్టీసీ బస్సు డ్రైవర్ కారును తప్పించే క్రమంలో పక్కకు తిప్పాడు. దీంతో ప్రమాదవశాత్తు కారును ఢీకొని పక్కకు దూసుకెళ్లి అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో పది మంది గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బెంగళూరుకు చెందిన చిన్నయ్య (58), కొండమ్మ (49), వెంకటరమణ (43), కనిగిరికి చెందిన లేయమ్మ (56), సారమ్మ (57), మాల కొండయ్య (69) పుల్లమ్మ (46) శ్రీనివాసులు 35) తదితరులు గాయపడిన వారిలో ఉన్నారు. వీరిలో చిన్నయ్య, కొండమ్మ, ఎం. కొండయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. కారు డ్రైవర్ కోసువారిపల్లెకు చెందిన బావాజీ (38) కూడా గాయపడి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బస్సు ఫ్లై ఓవర్ కిందకు వచ్చాక ప్రమాదం జరిగింది. ఫ్లై ఓవర్ పైన బోల్తా పడి ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కనిగిరి, మదనపల్లె డిపో ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.





బస్సు బోల్తా సంఘటనలో గాయపడిన ప్రయాణికులు

మహా విష్ణువుకు ఇష్టం.. మార్గశిర మాసం

నేటి నుంచి ప్రారంభం


విశేష అలంకారంలోస్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : మార్గశిరం.. మహా విష్ణువుకు అత్యంత ఇష్టమైన మాసం. వైష్ణవులకు ముక్తిదాయకమైన మాసం.. వరుస పర్వదినాలతో అధిక పుణ్యం సంపాదించుకునే మార్గం.. మార్గశిరమాసం .. ఈ మాసం, ఈ సందర్భంగా వచ్చే పర్వదినాలు, నిర్వహించే పూజల గురించిన వివరాలు..

అన్ని మాసాలలో మార్గశిరం తనకెంతో ఇష్టమైనదని మహావిష్ణువు స్వయంగా చెప్పినట్లు పౌరాణికులు చెబుతుంటారు. ఇతర మాసాలన్నింటికంటే ఈ మాసం వైష్ణవులకు అత్యంత పుణ్యదాయకమని భక్తులు భావిస్తారు. ఈ మాసంలో వచ్చే పలు పర్వదినాల్లో చేసే పూజలు తమకెంతో పుణ్యాన్ని ఇస్తాయన్నది వారి విశ్వాసం.

కార్తీక మాసపు అమావాస్య తర్వాతి రోజు సోమవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభం కానుంది. ఇది హేమంతంలో వచ్చే మొదటి నెల. సౌరమానం ప్రకారం ధనుర్మాసం, చంద్రమానం ప్రకారం మార్గశిర మాసం వస్తాయి. ఈ మాసంలో భక్తులు ఎక్కువ సమయం ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. ప్రకృతి కూడా మనోహరంగా కనువిందు చేస్తూ ఉంటుంది. మృగశిర నక్షత్రంతో కూడిన పౌర్ణమి వచ్చింది గనుక దీన్ని మార్గశిరమాసమని పేర్కొంటారు. ఈ మాసంలో ఏ పూజచేసినా అధిక పుణ్యం లభిస్తుందని పెద్దలు పేర్కొంటారు.

మార్గశిరంలో పర్వదినాలు

ఈ మాసంలో శివ పుత్రుడు సుబ్రమణ్యస్వామికి సంబంధించిన సుబ్రమణ్యషష్ఠి పండుగను ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో వచ్చే శుద్ధ షష్ఠిని సుబ్రమణ్యషష్ఠిగా కుమారస్వామికి పూజలు నిర్వహిస్తారు. ఫలితంగా యోగా, ఆరోగ్యబలం చేకూరుతాయని భక్తుల్లో విశ్వాసం ఉంది. శుక్లపక్ష సప్తమి నాడు లోకమిత్రుడు, ప్రత్యక్ష నారాయణుని ముఖ్యమైన రోజుగా భావిస్తారు. ఆరోజున దినకరుని పూజ ఆరోగ్యాన్ని ఇస్తుందని విశ్వసిస్తారు. మార్గశిర శుక్లపక్ష ఏకాదశి నాడు గీతా జయంతి వస్తుంది. ఈ సందర్భంగా విశ్వమానవాళికి ఉత్తమ మార్గదర్శనం చేసే జ్ఞాన గ్రంథం భగవద్గీత పారాయణం పుణ్యదాయకమని పేర్కొంటారు. శుక్ల ద్వాదశి నాడు మహా విష్ణువుకు సంబంధించిన వ్రతాలు, త్రయోదశి నాడు అంజనీపుత్రుడు హనుమంతుని పేరిట వ్రతాలు నిర్వహిస్తారు. ఈ పూజల ద్వారా దుష్ట గ్రహాల నుంచి వచ్చే బాధలు తొలగిపోతాయన్న నమ్మకం ఉంది. ఈ మాసంలోనే సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో ధనుస్సంక్రమణ పుణ్యకాలం ఆరంభమవుతుంది. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినంత వరకు ధనుర్మాసం ఉంటుంది. ఈ నెలలో కాలభైరవాష్టమి కూడా వస్తుంది. ఆరోజున నిర్వహించే పూజలు ఆరోగ్యదాయకమంటారు. మార్గశిర శుద్ధ పౌర్ణమినాడు దత్తాత్రేయ జయంతి నిర్వహిస్తారు.

కువైట్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

సుండుపల్లె : మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ, కోనంకివారిపల్లి హరిజనవాడకు చెందిన బండి వినోద్ కుమార్ (30) కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బండి వినోద్ కుమార్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. బతుకు దెరువుకోసం కువైట్‌కు వెళ్లి రెండేళ్లైంది. ఈ నెలలో స్వగ్రామానికి రావాల్సి ఉంది. ఇంతలోనే శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడని మృతుని బంధువులు తెలిపారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావు కోరారు. ఆదివారం పట్టణంలోని దళిత హక్కుల పోరాటసమితి కార్యాలయంలో ఆ సంఘం జిల్లా సాధారణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తూ వారికి దక్కాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందకుండా కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ దళితుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు తమ హక్కులు, చట్టాల గురించి తెలుసుకోనంత కాలం దోపిడీకి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నేతలు పండరయ్య, చుక్కా వీరభద్ర, సుధాకర్, గంగయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- రూ.12 లక్షల విలువ చేసే బంగారం, నగదు స్వాధీనం
- రాజంపేట డీఎస్పీ సుధాకర్ వెల్లడి


దొంగల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుధాకర్

రాజంపేట : రాజంపేట, చిట్వేలి పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్యాంకుల వద్ద జరిగిన దొంగతనాల కేసులకు సంబంధించి ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరు జిల్లా బోగలు మండలం కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ పిట్ల మహేష్, పిట్ల శిరీష్‌కుమార్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.12 లక్షల విలువ చేసే బంగారు, నగదు స్వాధీనం చేసుకున్నామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజంపేట, రైల్వేకోడూరు సర్కిల్ పరిధిలో రెండు బృందాలను రంగంలోకి దింపి, సీసీఎస్ పోలీసుల సహకారంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నామన్నారు. వారి నుంచి మూడు బంగారు కడియాలు, బంగారు సాదాచైన్ ఒకటి, రూ3,10,000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారు వస్తువుల బరువు 132 గ్రాములు ఉందని, వాటి విలువ రూ.9,44,000, మొత్తం రికవరీ విలువ రూ.12,54,000 ఉందన్నారు. నేరానికి ఉపయోగించుకున్న మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో రాజంపేట టౌన్ సీఐ యల్లంరాజు, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎస్ఐ రఘురాం, రాజంపేట, చిట్వేలి పోలీసులు పాల్గొన్నారు.

మిస్ ఏషియా చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సర్తాజ్ హుస్సేన్


పూజానిగం చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సర్తాజ్ హుస్సేన్

రాజంపేట టౌన్ : రాజంపేటకు చెందిన ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మిస్ ఏషియా పూజానిగం చేతుల మీదుగా దేవనాగరి సేవా సమ్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని ఆయన ఫోన్ ద్వారా ఇక్కడి విలేకరులకు తెలిపారు. దేవనాగరి ఉద్దాన్ ఫౌండేషన్ వారు భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి చేస్తున్న కృషికి ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. అందులో భగంగా 2024 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి తాను పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

గండికోటలో భద్రత డొల్ల!

- గుడారాల పేరుతో ఇష్టారాజ్యంగా దోపిడీ
- హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల వాహన అద్దం పగుల గొట్టిన దుండగులు
- పట్టించుకోని అధికారులు


గండికోట


గండికోటలో పగిలిపోయిన కారు అద్దాలు

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోటలో పర్యాటకులకు, వారి వాహనాలకు భద్రత కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వస్తున్న పర్యాటకుల నుంచి టోల్‌గేట్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నా వాహనాలకు భద్రత లేకుండా పోయింది. శనివారం గండికోటలో హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఏడాదిన్నర క్రితం ఏకంగా కారునే దొంగతనం చేశారు.

అధికారుల అనుమతులు లేకుండానే గుడారాలు..

గండికోట వెలుపల పెన్నానది వద్ద ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా గుడారాలు వేసి పర్యాటకులకు మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలు సైతం పెరిగిపోయాయి. సెలవు రోజుల్లో, శని , ఆదివారాల్లో వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాల నుం గండికోటను సందర్శించేందుకు ప్రత్యేక వాహనాల్లో పర్యాటకులు వస్తున్నారు. సెలవు రోజుల్లో కనీసం మూడు వేల మంది వరకు గండికోట ప్రాంతాన్ని సందర్శిస్తారని అధికారులు అంచనా వేశారు. పర్యాటకులకు వసతులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు గుడారాలు వేసి ఇష్టారాజ్యంగా డబ్బులు దోచుకుంటున్నారు. చాలా మంది అనధికారికంగా గుడారాలు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో చాలా సార్లు గొడవలతో పాటు, దొంగతనాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం పర్యాటకుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నామమాత్రంగా అవుట్ పోస్టు..

గండికోటలో పర్యాటకుల భద్రత కోసం పోలీసుల అవుట్ పోస్టును ప్రారంభించారు. అయితే అక్కడ పోలీసులు ఎవ్వరూ ఉండరు. అక్కడ ఏమైనా జరిగితే జమ్మలమడుగు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు స్థానికంగా లేకపోవడంతో గండికోటలో అసాంఘిక కార్యకలాపాలు సైతం పెరిగిపోతున్నాయి. ఏడాదిన్నర క్రితం బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రత్యేక వాహనంలో వచ్చి గండికోటను చూసేందుకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి కారు లేకపోవడంతో జమ్మలమడుగు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆధిపత్యం ప్రదర్శిస్తున్న గుడారాల యజమానులు..

పర్యాటకులకు తామే గుడారాలను వేయాలంటూ గ్రామస్తులు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు గ్రామస్తులు గొడవలు పడ్డారు. పర్యాటకుల వాహనాలపై కూడా దాడులు చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన పర్యాటకుల వాహనంపై గుడారాల యజమానులు దాడి చేసి కారు అద్దాలు పగుల గొట్టారు. దీంతో పర్యాటకులు సైతం భయపడే పరిస్థితి నెలకొంది.

పర్యాటకులకు భద్రత కల్పించాలి

గండికోటను చూసేందుకు సెలవు రోజుల్లో వేల మంది ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వస్తున్నారు. ఇప్పుడిప్పుడు అభివృద్ధి జరుగుతున్న గండికోటలో పర్యాటకుల వాహనాలపై దాడులు చేయడం సరైంది కాదు. అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి.

శివకుమార్, డీవైఎఫ్ఐ, జిల్లా నాయకుడు, జమ్మలమడుగు

పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకుంటాం

గండికోటలో పర్యాటకుల భద్రతకు చర్యలు తీసుకుంటాం. అవుట్ పోస్టులో పోలీసు సిబ్బందిని నియమిస్తాం. గుడారాలను వేసే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తాం. అనధికారిక గుడారాలపై చర్యలు తీసుకుంటాం.

లింగప్ప, అర్బన్ సీఐ జమ్మలమడుగు